



సాసాంసంమీ కార్యదర్శి మన్మోహన్‌దాసు మేజామీద కవర్లను చూశాడు. చిరునామా లన్నిటినీ ఒకసారి చదివాడు.

"పచ్చిపులుసు భీమారావు, మొగల్రాజపురం, విజయవాడ."

"మున్నకత్తి బాలాజీదాసు, బంగారు పేట."

"ఏనుగు నారాయణమ్మ, సాలెవీధి, కొత్తూరు"

"మెల్లా సుబ్బయ్య, త్రాసుపురం (వయా) నెల్లూరు"

"సున్నాల కన్నమ్మ, తిరువూరు"

"అయ్యగారి సిమ్మాచెలం, ధనలక్ష్మి లాండ్రీ, మంగళగిరి"

"నాపరాతి సాగరయ్య, పోచంపాడు"

"డాక్టర్ ఎన్. ఆనందరావు, విజయనగరం"

"మిస్ స్వతంత్రకుమారి, వడపళని, శెన్నై"

ఆఖరు అడ్రసు చదివి నాలుకతో అడుగు పెదవిని తడి చేసుకున్నాడు దాసు.

"అమ్మయ్య, ఈ ఏడాది తద్దినం అయిపోయింది." అనుకుని దాసు పెద్ద రిలీఫ్‌తో కేకేసాడు– "గవరయ్యా!"

గవరయ్య విచ్చేశాడు.

"ఈ తొమ్మిది కవర్లనూ రిజిస్టర్ పోస్టులో పంపించు-" అనేసి మన్మోహన్ దాసు విక్కీ మీ దెక్కీ హుషారుగా ఈలవేసుకుంటూ "అజంతా" కు వెళ్ళి క(సేపు) బీరు దాసుడై అటు పిమ్మట 'వెంకటేశ్వరా'లో ఆడింపబడుతున్న జేమ్సు బాండ్ ప్రపంచంలోకి లీనమయిపోయాడు.

జేమ్సు బాండ్ విలాసంగా అయిదుగురు బికినీసుందరుల మధ్య పడుకుని ఆడుకుం టున్న సమయానికి శ్రీమతిలహరి సత్యభామయ్యై, తన భవంతిలోని కోపగృహానికీడయిన పడకగదిలో, ఫోమ్ రబ్బర్ పరుపుల కడ్డంగా పడివుంది.

ఎవరీ శ్రీమతి? ఆమె "శ్రీ" ఎవడు? అని అడిగితే ఖచ్చితంగా కొన్ని వివరాలు చెప్పవచ్చును. మరికొన్ని అంత ఖచ్చితంగా చెప్పలేము.

ఈ సువిశాల ప్రపంచంలో కొందరు లలనలు నిరత యౌవనాగ్ని హోత్రలు, వారికి అవస్థాభేదా లుండవు. వారు వయో పరిమితుల కతీతులు. వారు సతత సచ్చిదానంద సరోవరవిహారులు. అట్టి చిరంజీవులలో ఒకతె అయిన శ్రీమతి లహరి సదా శ్రీమతియే, ఆమెకు ఎవరో ఒక 'శ్రీ' అంటూలేరు, లేరా అంటే లేరనీకాదు. ఒక 'శ్రీ' కలడు, బహు 'శ్రీ' లూ కలరు.

లహరి నరసమ్మగా ఎక్కడో పుట్టి ఎట్లాగో పెరిగింది. తండ్రి చిన్నప్పుడే కీర్తిశేషుడు. తల్లి ఇప్పటికీ ఎక్కడో కుగ్రామంలో వుందంటారు. నరసమ్మకూ మామూలుగా అందరు అమ్మాయిలలాగే మెట్రిక్ పాసవగానే ఓ టీచర్‌తో- అతగాడి పేరు నారాయణ- పెళ్ళయింది. కాని సినిమాలూ, సీరియల్ నవలారాజంబులూ చూసి, చదివి, మానసికంగా తెగ ఎదిగిపోయిన నరసమ్మను ఆ చిన్న వూరు, ఆ టీచరు మొగుడు కట్టి పడేయలేక పోయారు.

నరసమ్మ "లహరి"గా సంపాదకుడికి లేఖలు, కార్టూన్లమీద ఆగ్రహ వ్యాసాలు, మహిళోద్ధరణకై చాంతాళ్ళ లాటి ప్రబోధాలు, రాసింది. ఒకనాడామె హఠాత్తుగా ఓ నాట్య ప్రదర్శన చూసింది.

ఆమె పూర్వజన్మ విశేషం ఏమిటో గాని ఆ నాట్య ప్రదర్శనలో సరిగ్గా నర్తకి, తరంగం అభినయిస్తున్న ఆ క్షణాన ఆమెలో సుప్త భుజంగంవలె నిద్రాణమైవున్న నవలా రచనాశక్తి అన్నది హఠాత్తుగా కుండలిని లా లేచింది; సముద్రంలో హైడ్రోజన్ బాంబు ప్రేలినప్పటి 'మష్‌రూము'లా లేచింది; "నాకీ నాట్యం వద్దు భగవాన్!" అన్న నవలగా లేచింది. ఆ లేవడం లేవడం ఇప్పటికింకా ఆరున్నొక్క సంవత్సరాలయి నిరాఘాటంగా నాట్యం చేస్తూనే వుంది. "నాకీ నాట్యం వద్దు భగవాన్!" తర్వాత శ్రీమతి లహరి నెలకొక చిన్న నవల, ప్రతి మూణ్ణెల్లకొక పెద్ద నవలలు రాసే వేగానికి దేశంలోవున్న వార, మాస పత్రికలు చాలకపోగా తనంతట తానుగా ఒక వారపత్రికను, ఒక మాస పత్రికను మొదలుపెట్టి ఒక ఏడాదిపాటు నడిపింది.

ఆ తర్వాత ఆమె ఒక సుముహూర్తాన "ఏడుకొండలవాని పాద పద్మాలకు" రెండు ఫుల్‌స్కేపు పేజీల పొడవున "సజలనయనాలతో" నమస్కరించి మరీ మొదలుపెట్టింది.

తన 'మేగ్నమ్ ఓపస్'ను. ఆలోచించి ఆలోచించి దానికి– "పసిఫిక్ పర్వతాల ఒడిలో–" అని నామకరణం చేసింది. శనివారం మొదలుపెట్టి మంగళవారానికల్లా పూర్తిచేసి దానిని దసరా నవలల పోటీకి, ఒక 'మీ(మా)' అభిమాన వార పత్రికకు పంపింది.

ఇహనేముంది, 'కల్యాణమొచ్చినా, కక్కొచ్చినా' అన్నట్టుగా ఆ నవలకు నవలల పోటీలో, ఒకటీ రెండూ కాదు మూడు బహుమతులు వచ్చేశాయి. అది ఎట్లన్నన్–

మొదటి బహుమతికి అర్హాతిఅర్హమని ఎన్నికయిన శ్రీమతి లహరి నవల నిజంగా పసిఫిక్ పర్వాతాలంత ఎత్తున, అత్యద్భుతంగా, అనన్యంగా వుండగా– మిగతా నవలలన్నీ కూడా చెత్తబుట్టకు కూడా పనికి రానివిగా వుండినాయి. అందుకని మేధావులయిన ఆ పత్రికా సంపాదక వర్గంవారు లహరిగారి నవలనే మూడు భాగాలుగా చేసి, మొదటి భాగానికి మొదటి బహుమతీ, రెండవ భాగానికి రెండవ బహుమతీ, మూడవ భాగానికి మూడవ బహుమతీ అన్చెప్పి ఇచ్చేశారు.

తెలుగు నవలా సాహిత్యంలో ఇంతటి మహత్తర సన్నివేశం జరిగిపోయాక దేశంలోని సాహితీ సమితులు, సంస్థలు ఇహ వుండబట్టలేకపోయాయి. శ్రీమతి లహరికి, చీర మార్చుకోవడానికి కూడా వీల్లేనన్ని సన్మానాలు చేసేశారు. ఒకానొక కవి దర్బారు లోనయితే కవిమార్తాండులు, ధ్వని ప్రకాండులు, ఇత్యాదయః చేరి శ్రీమతి లహరికి 'నవలాకులతిలక'మనే బిరుదు ఇచ్చారు. ఇక అక్కడినుండి లహరి కీర్తి మైలాయ్‌లో వియత్నామీయుల ప్రాణంలా ప్రాగ్‌లో జాన్ పాలాక్ దేహంలా వెలిగిపోసాగింది.

అట్టి సభలో శ్రీమతి లహరి ఒకానొక సభలో కలిసింది శ్రీ సవ్యసాచి గారిని.

సవ్యసాచిగారు– నిజంగా చెప్పాలంటే – "ఒరిజినల్ సవ్యసాచి టు ది పవర్ ఆఫ్ ఎన్"గారు. ఆయన కానిది లేదు. ఆయనకు తెలియనిది లేదు, ఆయన చేపట్టనిది లేదు. "మధురాధిపతేరఖిలం మధురం" అన్నట్లు ఆయన జీవితమే ఒక సుదీర్ఘ మధుర మందహాసం. కృషీవలుడుగా, రచయితగా, రాజకీయ నాయకుడుగా, గాయకుడుగా, బహుభాషా కోవిదుడిగా, నారీమానస చోరుడుగా, నానాదేశ యాత్రికుడుగా, ఆశ్రిత వత్సలుడుగా, అశేష భక్తకోటికి ముక్తిదాయకుడుగా– సవ్యసాచిగారికి సవ్యసాచిగారే సాటి.

లూనార్ మాడ్యూల్‌ని కమాండ్ మాడ్యూల్ కలిసినట్లుగా శ్రీ సవ్యసాచిని శ్రీమతి లహరి కలవడం కూడా కేవలం విధి నిర్ణయమనే అనుకోవాలి.

ఆ క్షణంనుంచి సాహిత్యరంగంలో వినూత్నమైన వెలుగులు, కొంగ్రొత్త పరిమళాలు వీచ నారంభించాయి.

ఈ కలయిక కాక ఏడాదిముందుగానే కీర్తి చంద్రికలతో వెలిగిపోతూ పోతూ. ఒకసారి తన స్వగ్రామానికి వెళ్ళిన లహరి అక్కడ – జీతాలు సరిగ్గా అందక పస్తులతో మూలుగుతున్న తన టీచర్ భర్తను చూచి జాలిపడి తనకు మేనేజర్‌లా వుండడానికిష్టమయితే రమ్మని పిలిచినదే తడవుగా ఆ నారాయణ ఆమె వెంట వచ్చేశాడు.

అతడు, ఇంతోఅంతో సాహిత్యగంధం వున్నవాడవడంమూలాన్ని, ప్రస్తుతానికి

లహరీ సాన్నిహిత్యం కూడా సమకూరడం మూలాన్ని- ఆమె నవలలకు సాపు ప్రతులు, ఆమె ప్రసంగాలు, పాఠకుల సందేహాలకు రామబాణాల్లాంటి సమాధానాలు మొదలయినవి రాయసాగాడు. మధ్య మధ్య "సీతమ్మవారి జడకుచ్చులు" "ఇప్పటి నేపాలు అప్పటి క్షీరసాగరమా?" "భీముడి ఆహార మెట్టిది?" - వంటి భారీ విషయాలమీద 'దాళ పత్రములు' గ్రటా రెఫర్ చేస్తూ సీరియస్ సాహిత్య వ్యాసాలూ రాయసాగాడు.

'సర్వేజనా స్సుఖినో భవంతు' అన్న ఉపనిషద్వాక్యం మేరకు నారాయణ ఇక్కడ వుండడం అందరికి శ్రేయోదాయకమేనని లహరికీ సవ్యసాచికీ తెలియనిది కాదు. నారాయణ కోరింది మాత్రం ఏముంది? ఆ భవంతిలో ఓ మూలగదిలో టెలిఫోనూ, ఏర్ కండిషనర్లమధ్యే ఆ నారాయణుడి వైకుంఠం. ఇక లక్ష్మి సంగతా? లక్ష్మి చంచలయని పురాణాలు ఆదినుంచి ఘోషిస్తూనే ఉన్నాయి. అంచేత ఎవరికివారే, దేనికదే- అన్న అలీన విధానం అవలంబించి నారాయణ హాయిగా తన యథాశక్తి సాహి త్యసేవ చేస్తూ వచ్చాడు. సవ్యసాచిగారి ధర్మమా అని అటునుండి ఇటు, ఇటునుండి అటుకు మూడో నాలుగో అనువాదాలు చేశాడు. అతి త్వరలో అతగాడికి "అనువాద శార్దూలము" అనే బిరుదాన్ని ప్రసాదించే ఏర్పాట్లలో వున్నారు. సాసాంసమీకి పెద్ద తలకాయ అయిన శ్రీ శ్రీ శ్రీ సవ్యసాచి. కానీ ఏదీ, సవ్యసాచిగారికి క్షణం తీరిక కూడా దొరకడం లేదు. అటు పార్టీ ఎన్నికలు, ఇటు బ్యాంక్ డైరెక్టర్ల సమావేశాలు, అటు డెలిగేషన్ల యాత్రలు, ఇంకోవైపు సాసాంసమీ బహుమతుల నిర్ణయం, అంకితాల సభలు, పంచరత్నాల సమావేశాలు - ఈ విధంగా తికతిక పడిపోతున్నారాయన.

సాసాంసమీ బహుమతి ఈ ఏడాది ఎవరికివ్వాలన్న విషయంమీద సవ్యసాచిగారు గత సంవత్సరమే ఒక నిర్ణయానికి వచ్చివున్నారు. ఆ మేరకు ఆయన సాసాంసమీయొక్క తొమ్మండుగురు సభ్యులకూ ఆదేశాల నిచ్చే వున్నారు. ఆ నవగ్రహాలూ శ్రీవారి నిర్ణయం మేరకు ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ సంతకం పెట్టేసి శ్రీవారి కటాక్ష వీక్షణాలు పొందడానికి విలవిలలాడి పోతున్నారు. వారావిధంగా ఎదురుచూస్తున్న నిర్ణాయక పత్రాలను తపాలుద్వారా పంపించడానికి ఏర్పాటు చేశాకనే మన్మోహన్‌దాసు జేమ్సు బాండ్‌ని చూడ్డానికి వెళ్ళాడు.

దాసు జేమ్సుబాండ్ చిత్రాన్ని చూసి ఆనందిస్తుండగా లహరి కోప గృహంలో చేరింది.

ఆమె తెల్లచీర కట్టింది. పొడుగు చేతుల రవిక ధరించింది. నూనె బాగా రాసుకొని ఒత్తుగా తల దువ్వుకుంది. చేతులకు గాజులు ధరించింది. మెడలో అరు హారాలు వేసుకుంది. చెవులకు దుద్దులు పెట్టుకుంది. బొట్టు పెట్టుకుంది.

ఈ విధంగా కోపవేషం ధరించిన లహరి తన కోపాన్ని సవ్యసాచిగారికి తెలుపమని నారాయణకు సూచించి మరీ కోపగృహాంతర్గత అయింది.

వెంటనే విశాఖపట్నంలోని తుఫాన్ హెచ్చరిక రాడార్‌లా పనిచేశాడు నారాయణ. టకటక సవ్యసాచిగారుండగల అయిదారు అంతఃపురాలకు అర్జెంటుగా తంతులు, కబుర్లు పంపివేశాడు. పంపేసి తన గదిలో కూచుని ఆనాటి దినపత్రికలోని ఒక 'అర్యా!'

లేఖ చదవసాగాడు.

ఆ లేఖలో సాహసంపమీ సభ్యత్వం గురించిన విమర్శ వుంది. సదరు సభ్యత్వం – నలభీములు, వ్యాపారులు, వైద్యులు, సినీ కళాకారులు, కంట్రాక్టర్లు– మున్నగువారికి ఇచ్చి తమలాటి వారికి అందులో ప్రాతినిధ్యం ఇవ్వక పోవడంపట్ల తీవ్రమయిన అసంతృప్తి తెలుపుతూ – రైలు ప్రయాణీకుల సంఘంవారు, కళాసీల పరిషత్‌వారు – ఇట్లా అయిదారు సంఘాలవారూ, వృత్తులవారూ ఆ లేఖ రాశారు.

అది చూసి మండిపడిపోతూ నారాయణ దానికి ఘాటయిన జవాబు రాయడం మొదలుపెట్టాడు.

అతడా వుత్తరం మొదలుపెట్టిన పదవ నిముషానికి, అరఘంట సేపులో నలభై రెండు మైళ్లు దాటిన ఇంపాలా వచ్చి ఆ భవంతిముందు నిలబడింది. దానినుండి సవ్యసాచిగారు దిగారు. దిగీదిగగానే ఆయన తిన్నగా కోపగృహంలోకి వెళ్ళిపోయారు.

వెళ్ళి చూశారు. పరిస్థితిని అర్థం చేసుకున్నారు.

మంచంమీద కూర్చున్నారు.

నెమ్మదిగా పలకరించారు– 'లహరీ!'

విరామం.

మౌనం.

"రాణీ! నువ్వడిగితే నేను కాదన్న దేనాడయినా వుందా? చెప్పమరి....."

నిశ్శబ్దం.

"చెప్పు లహరీ చెప్పు.....చెప్పిన మరుక్షణం నీ వాంఛ ఈడేర్చకపోతే నా ప్రాణాలు నీ కర్పిస్తాను. .... చిరునవ్వుల అల్లరితో గలగలలాడవలసిన నువ్వు కోపంగా మౌనంగా, వుంటే పున్నమినాడు అలలులేని సముద్రంవలె వుంది లహరీ!"

ఫక్కున నవ్వింది లహరి....

సవ్యసాచిగారి ఎద మయూరి అయింది "ఆ అదీ! అట్లా వుండాలి నా ఊర్వశి ....ఏదీ సెలవియ్యి మరి. ..."

"ఏమిటో ఆ తొందర?"

"అంతా గాలిమూటలే"గోముగా ఇటు తిరిగింది లహరి.

"ఎందుకీ సాధింపు?– అసలు విషయం చెప్పవా?"

"చేస్తారా?"

"చేయక బతకగలనా?"

చెప్పింది లహరి. పకపక నవ్వారు సవ్యసాచి.

ఈపాటి దానికేనా అన్నారు. అయిపోయిందనుకోమన్నారు.

"ఉండండి వస్తా" నని లేచి వెళ్లింది లహరి.

తలనూనెను షాంపుతో కడిగేసుకుంది. పొడిపొడిగా చెల్లాచెదరుగా జుత్తుదువ్వుకుంది. పువ్వులు విసర్జించింది. మెడలోని నగలు తీసి పారేసింది. భుజాలు దాటని

రవిక తొడిగింది. ఇరవై నిముషాల తర్వాత ఆ గదిలోకి అడుగిడిన లహరినిచూచి "అమ్మయ్య! కోపం పోయిందా నా లహరికి?" అన్నారు సవ్యసాచి.

గబగబ మంది లహరి.

ఆ తర్వాత అక్కడ, అంతా కదనకుతూహలమే ! ఆనందభైరవే !

నారాయణ సాసాంసమీ తరఫున దినపత్రికకు – ఆ లేఖను పూర్తిచేసి పోర్టికోలోకి వచ్చే సరికి సవ్యసాచిగారు కారెక్కుతున్నారు.

"హలో" అన్నారాయన.

'ఆర్యా' లేఖ గురించి, దానికి తన ప్రత్యుత్తరం గురించి చెప్పాడు. 'భేష్' అని అతడి భుజం తట్టారు సవ్యసాచి.

అక్కడినుండి శ్రీ సవ్యసాచి ఆ రాత్రివేళ సాసాంసమీ కార్యాలయానికి వెళ్ళారు. అప్పుడే జేమ్సుబాండ్‌ను చూసి, తిండి తిని, గది చేరిన దాసు సవ్యసాచిగారి పిలుపు నందుకుని నిముషాలమీద వచ్చి ఎదుట నిల్చున్నాడు.

"దాసూ!"

"ఎస్సార్ !"

"ఈ ఏడాది మన బహుమతి...."

"నిరంజనాచారి కిద్దా మంటూ సాయంత్రమే మనవాళ్ళందరికీ పత్రాలు పంపే శాను.... ఎల్లుండి సంతకాలతో తిరిగి వచ్చేస్తాయి."

"కాదు చిన్న మార్పుంది."

"మార్పా సార్ !"

"అవును, నిరంజనాచారికి వచ్చే ఏడాది ఇద్దాము. ఈ సారికి ఇన్నయ్య పంతులు కిద్దాము."

"ఇన్నయ్య పంతులా?"

"ఆయన రాసిన 'కాళిదాస చరిత్ర' కిద్దాము."

"అది ఆధునిక సాహిత్యం కిందకు....."

"ష్ ! ఆధునిక మంటే ఏమిటి? ఆనాడు రాసినా నేటికి నిలచివున్నది. నిత్య యౌవనమైన ఆధునిక రచన కాక పాత దవుతుందా? కాళిదాసు గురించి ఏమిరాసినా ఎన్నడు రాసినా అది ఆధునికం కాక పురాతనం అవుతుందా?"

"కాస్సార్ ! కానేకాస్సార్ !.....అయినా..."

"కావాలంటే నియమావళిని సవరించు. రాత్రికి రాత్రే మన నిర్ణాయక సంఘంవారికి, పత్రికలకు కబురు అంది పోవాలి."

"ఎస్సార్!"

"నా సంతకా లేమన్నా కావల్సివుంటే పొద్దున ఎనిమిదిలోగా రా! ఆ తర్వాత వారంరోజులపాటు దేశంలో వుండను–"

"నిజంగానాసార్....." అన్నాడు. తననాయకుడు ఇంత పెద్దవాడయినందుకు అణువణువునా సంతోషం, గర్వం ఉప్పొంగిపోతున్న మన్మోహన్ దాసు.

ఆ మరుసటిరోజు పొద్దున దినపత్రికల్లో తనకు ఆ ఏడాది సాసాంసమీ బహుమతి ఇవ్వనున్నట్లు వచ్చిన వార్తను చదివి ఇన్నయ్యగారు సంతోషంతో తలకిందులయిపోయారు. కాసేపటికి తిన్నగా లేచి, నిలబడి, టాక్సీ ఎక్కి, పండ్లూ, పూలూ, మిఠాయిలతో వెళ్ళి, అరఘంట వేచి, శ్రీమతి లహరిని కలుసుకుని చేతులు జోడించి – "అమ్మా ! మీదయ అపారం !" అన్నాడు.

మందహాసమే లహరి సమాధానం.

"మీ శక్తి అమోఘం."

లహరి నవ్వింది.

"నా కృతజ్ఞత ఎట్లా తెలుపుకోవాలో తెలియడంలేదు."

"అదేమిటి నిరంజనంగారూ! మీరు నాకు చేసిన సాయం నేను మాత్రం మరచిపోగలనా? ఇవన్నీ ఎందుకూ."

"ఉంచండమ్మా వుంచండి.... ఏదో నా సంతోషానికి గుర్తుగా ...అంతే "

కాసేపు తర్వాత ఇన్నయ్యగారు తమ ఇంటకి వచ్చేశారు. ఇన్నయ్యగారు "పసిఫిక్ పర్వతాల ఒడిలో" నవలలోని నవరసాలను ఇంకా అదనంగా దొరికిన ఒకటి రెండు రసాలను, ఆనవలలోని తాత్త్వికదృష్టిని బయటికి తీసి, ఆ నవలలోని ప్రతిభా విశేషాలను ఎత్తిచూపుతూ వ్యాసాలు రాసి అంధపాఠకలోకానికి దృష్టి కల్పించడమే ఆయనపై అమ్మగారి చల్లనిచూపు ప్రసరించడానికి కారణం.

నిరంజనాచారిగారేదో సభలో–

"ఆ దానికేమితెలుసు, పిచ్చికుంక"– అన్నట్లు దాఖలావున్న దినపత్రిక కటింగు నుకూడా ఇన్నయ్యగారు అమ్మగారికి దఖలుపరచడం రెండవ కారణం. అమ్మగారి నవలారాజాలలోకి ఎప్పటికెయ్యది ప్రస్తుత మప్పటికా శ్లోకాలను, సూక్తులను టోకుగాను, చిల్లరగాను, ఆయన సరఫరా చేయడం మూడవ కారణం.

కారణాలు ఏవయితేనేమీ తన వైరి నిరంజనంగాడిని చిత్తుగా ఓడించి, వాడి ఎదుటవున్న సిద్ధాన్నాన్ని కొట్టుకువచ్చేశాడు తను. ఇన్నయ్యగారిల్లు విజయోత్సాహంతో నిండిపోయింది.

చేతిదాక వచ్చికూడా ఎగిరిపోయిన బహుమతిని తలచుకుని నిరంజనం ఏడవకుండా వుండగలందులకై ఆయన్ని తన ప్రతినిధివర్గంలో చేర్చుకుని అలాస్కా వెళ్ళిపోతున్న సవ్యసాచిగారూ విజయం సాధించామన్న తృప్తితో వున్నారు.

"నా అలాస్కా యాత్ర విషయం వింటే గిలగిల తన్నుకుంటాడా ఇన్నయ్యవెధవ!" అన్న సంతృప్తి నిరంజనం గారిది.

సాసాంసమీ సభ్యులు తొమ్మిది మందికీ ఆతర్వాతి 56 గంటల్లో సాసాంసమీ నుండి రెండేసి పత్రాలు వచ్చాయి. వాటి రెంటి మీదా సంతకాలు పెట్టవలసినచోట బుద్ధిమంతుల్లా పెట్టి పోస్టుచేశారు వారు. ఆ మొదటి తొమ్మిది పత్రాలను చింపి

అవతలపారవేసి, రెండవ తొమ్మిది పత్రాలను ఫైలులో వుంచాడు దాసు.

ఇక్కడ–లహరి విఖ్యాత సినీనిర్మాత గుండయ్యగారితో కులూలో ఆనందలహరియై విహరిస్తుండగా – అక్కడ – అలాస్కాలో –

సున్నాకన్న ఇరవై రెండు సెంటిగ్రేడు డిగ్రీలు తక్కువ ఉష్ణోగ్రతవున్న అలాస్కాలో–

ఒకానొక సమావేశంలో–

సవ్యసాచిగారు–

అలవాటుచొప్పున భారతదేశ చరిత్ర, ఇతిహాసము, శిల్ప చిత్ర సంగీత కళలు, గాంధీ నెహ్రూలు, పంచశీల, ప్రజాస్వామ్య సోషలిజం–ఇత్యాది పోపుమసాలా కలిపివండిన బృహత్తరమైన ప్రసంగాన్నివ్వ బూనుకున్నారు.

నలభైయైదునిముషాల ప్రసంగంలో ఆయన నోరు నలభైయైదు నిమిషాల సేపూ తెరిచే వుండడంతో, అక్కడి అతిశీతల వాయువులు లోపలికి ప్రవేశించి అప్పటికప్పుడు నాడీమండలం గడ్డకట్టుకుపోగా, అలాతెరిచిన నోరు తెరిచినట్లుండగానే మాటపడిపోయింది సవ్యసాచిగారికి.

పన్నెండు గంటల తర్వాత ఆయన అక్కడే (ల) హరీ మన్నాడు. ఆ వార్త విని ఈ జంబూ (క) ద్వీపంబందలి భరతవర్షం బనంబడు భరత ఖండంబునందుండు సాహితీ (రా) బందు (వు)లూ, మన్మోహన్ దాసాను దాసాదులూ, రాణులూ, దేవులూ, చిల్లర దేవుళ్ళూ, బొట బొట మని కన్నీరు కార్చారు. తీర్మానాలు చేశారు. మౌనంగా నిలబడ్డాడు. స్మారక శిలావిగ్రహం నిమిత్తం ఓ సంఘాన్ని ఎన్నుకున్నారు. చందాలు వసూలు మొదలుపెట్టారు. "దేవుడు – మన తండ్రి, ఎంతో చల్లనివాడు–" అనుకున్నాడా నిధిసేకరణకు బాధ్యుడు, దేవుని బిడ్డలలో ఒకడు – మన్మోహన్ దాసుడు.

కులూనుండి వెనక్కువచ్చి సవ్యసాచి భౌతిక కాయానికి ఒక పూలమాల నర్పించి మళ్ళీ కులూ వెళ్ళిపోయింది లహరి.

"నేటి సాహిత్యంలో నైతిక విలువలు" అన్న సీరియల్ వ్యాసావళిని, కీ.శే. సవ్యసాచిగారి దివ్య స్మృతికి అంకితంచేస్తూ ప్రారంభించాడు నారాయణ.

"సాహిత్య సాంవత్సరిక సంఘమీ" వారి కార్యాలయం వారంరోజులు మూత పడింది.

– దేశం నిండా వకనకలాడుతున్న రావులు, శర్మలు, మూర్తులు, మణ్యాలు, అయ్యలు, పతులు – ఎట్టకేలకు సాహిత్య చంద్రునికి పట్టిన గ్రహణం వదిలినట్టేనా – అని ఎదురు చూస్తున్నారు భయం భయంగా, ఆశ ఆశగా.....

*['స్వాతి' మాసపత్రిక, జూలై '70]*